క్లుప్తంగా

నూతన నియామకాలు ఆపాలి

దమ్మపేట: రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలను పూర్తయ్యే వరకు నూతన నియమకాలను ఆపాలని గిరిజన గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూతకాని శ్యామ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గిరిజన గురుకుల ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులను నియమాకాల కంటే ముందుగా చేపడితే ఏళ్ల తరబడి సుదూర ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు, వారి ప్రాంతాలకు వచ్చే అవకాశం కోల్పోతారన్నారు. గురుకులాల్లో కొలువులకు నోటిఫికేషన్ ఇచ్చిన ప్పటికీ, బదిలీలు, పదోన్నతులు పూర్తయ్యాకే నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భద్రాచలంటౌన్: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ తంబూరు దయాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణం కూనవరం రోడ్డులోని మానవసేవ వృద్ధాశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆశ్రమంలో కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో దొడ్డిపట్ల కోటేష్, మహమ్మద్ జిందా, ధనకొండ ప్రసన్న, సరెళ్ల వెంకటేష్, అసద్, రామకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

మణుగూరు టౌన్: ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, జీవి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. శనివారం వేర్వేరుగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలోనిఅన్ని ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లు పిలుపు మేరకు సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

దమ్మపేట: వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ, అఖిలపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ప్రజాపంథా నాయకులు అమర్లపూడి రాము మాట్లాడారు. యార్లగడ్డ భాస్కర రావు, మోరంపూడి శ్రీనివాసరావు, తోడెం దుర్గమ్మ, మద్దిశెట్టి సత్యప్రసాద్, వలీపాషా, యార్లగడ్డ బాబు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భవన నిర్మాణ కార్మికులకు రక్షణ కవచంగా ఉన్న వెల్ఫేర్ బోర్డులో దళారులు ఎక్కువయ్యారని, దళారుల నుంచి వెల్ఫేర్ బోర్డును కాపాడాలని సీఐటీయూ నాయకులు వైవి.రామారావు కోరారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. పెయింటర్ సీనియర్ అధ్యక్షుడు ఎస్‌కె.జాకీర్, రాడ్ బెండింగ్ సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పిట్టల రాజబాబు, ట్రెజరర్ కిషోర్, అన్నవరం, తులసి, నాగూర్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

చంద్రుగొండ : చంద్రుగొండ - జూలూరుపాడు మండలాల మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రెండు మండలాల మధ్య అనేక గ్రామాలున్నాయిని, గతంలో నడిచిన బస్సు సర్వీసును సత్వరమే అధికారులు పార్టీ నాయకుడు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయి రాజా, పెద్దిని వేణు, జైతూన్‌బేగం, అబ్దుల్ రహిమాన్, విప్పర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని 13 గొర్రెలు మృతి

అన్నపురెడ్డిపల్లి: వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొనడంతో గొర్రెలు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ షాహీనా, బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని బూర్గుడెంకు చెందిన రొంటె మునేష్ తన గొర్రెలను జాతీయ రహదారిని దాటిస్తుండగా కొత్తగూడెం నుంచి వీఎం బంజర్ వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో 13 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి. ఈ మేరకు రూ.2లక్షల మేర నష్టం జరిగిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మసకబారుతున్న మన్యం సంత..

- ఉమ్మడి జిల్లాలోనే పెద్దదిగా పేరుగాంచిన చర్ల సంత
- నాడు వేలాది మందితో కళకళ.. నేడు వెలవెల..
- తనిఖీలతో వచ్చేందుకు జంకుతున్న ఆదివాసీలు
- వ్యాపారాలు సాగక నష్టపోతున్న చిరు వ్యాపారులు


వెలవెలబోతున్న చర్ల వారపు సంత

చర్ల: మన్యం సంత మసక బారుతోంది. నాడు వేలాదిగా ఆదివాసీలు తరలివస్తే చర్లలోని వారపు సంత కొనుగోళ్లు అమ్మకాలతో కలకలలాడేది. కానీ ప్రస్తుతం ఈ సంతకు ఆదివాసీలు ఆశించినంత సంఖ్యలో రాకపోతుండడంతో వారపు సంత వెలవెలబోతోంది. గతంలో రహదార్లు లేకపోయినా, వాగులపై వంతెనలు లేకపోయినా సంతకు ఒక రోజు ముందే అంటే శనివారమే చర్లకు చేరుకొని ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అటవీ ఉత్పత్తులు, వారు పండించే ఆహారపు ఉత్పత్తులు తీసుకువచ్చి వారపు సంతలో విక్రయించే వారు. వచ్చిన డబ్బులతో వారికి కావాల్సిన సరుకులు, సామగ్రి కొనుగోలు చేసి తీసుకొని వెళ్లేవారు. అదేవిధంగా ఉన్న గానుగ మిల్లుల్లో ఆదివాసీలు సైకిళ్లపై కట్టుకొని తీసుకొచ్చిన ఇప్పబద్దలను నూనె పట్టించుకునేందుకు చర్లలో అప్పట్లో సుమారు గానుగమిల్లుల వద్ద ఆదివాసీలు బారులు తీరేవారు. దీంతో మండల కేంద్రం సంతకు వచ్చిన ఆదివాసీలతో కిక్కిరిసేది. సంతరోజు వాహనాలు అంబేడ్కర్ సెంటర్ నుంచి గాంధీసెంటర్ వరకు వెళ్లాలంటే కనీసం గంటపైనే సమయం పట్టేది. దీనిని బట్టి వారపు సంతకు ఎంత మేరా జనం వచ్చే వారో అర్థం చేసుకోవచ్చు.

రోజుకు రూ.1 కోటి మేరా వ్యాపారం..

సరిహద్దు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల నుంచి ప్రతీ వారం సుమారు 15 నుంచి 20 వేల మంది వరకు వేల ఆదివాసీలు సంతకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో ప్రతీవారం చర్లలో వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు, కిరాణా, వస్త్ర, ప్యాన్సీ ఇతర అన్నీ దుకాణాదారులు సగటున రూ.1 కోటి మేర వ్యాపారం సాగించేవారు. సంతకు ముందు శుక్ర, శని వారాల్లో సంతలో సాగే విక్రయాల్లో విక్రయించేందుకు వ్యాపారులు విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి చెన్నుపాటి ట్రాన్స్‌పోర్ట్ లారీల ద్వారా సరుకులను దిగుమతి చేసేవారు.

పూర్వ వైభవనం వచ్చేదెన్నడో..

అప్పట్లో ఈ సంత ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అతి పెద్ద సంతగా పేరు గాంచింది. ప్రస్తుత ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపహాడ్, అశ్వాపురం, ఆంధ్రాలోని కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లోని చిరు వ్యాపారాలు సైతం ఈ సంతలో విక్రయాలు చేసి ఒక్కొక్కరూ రూ.10 వేల మేర ఆదాయాన్ని సమకూర్చుకునే వారు. అయితే కాలక్రమేణా ఈ సంత ప్రాభల్యం తగ్గిపోతుంది.

తనిఖీలు పెరగడంతోనే..

గడిచిన పదేళ్ల కాలంగా చర్ల సరిహద్దున ఉన్న చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు అధికమవ్వడంతో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలను నిర్వహిస్తుండడంతో సంతకు వచ్చే ఆదివాసీల సంఖ్య క్రమంగా తగ్గుతోంది దీనికి తోడు సరిహద్దున ఉన్న చతీస్‌ఘడ్ రాష్ట్రంలో ఉన్న సుకుమా, బీజాపూర్ జిల్లాల్లోని గ్రామాల్లో సంతలు కొనసాగుతుండగా, సమీప గ్రామాల్లోని ఆదివాసీలు అక్కడే వారికి కావాల్సిన సరుకులను కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో చర్ల సంత వెలవెలబోతోంది. చర్ల సంతకు నాడు వచ్చిన విధంగా వేలాదిగా ఆదివాసీలు తరలి రావాలని, కొనుగోళ్లు, అమ్మకాలు సాగి సంతకు పూర్వవైభవం రావాలని చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలి



ఒకప్పుడు చర్ల సంతకు సంతకు వేలాదిగా జనం వచ్చేవారు. దీంతో చర్లలో ప్రతీ ఆదివారం పండుగ వాతావరణం నెలకొని ఉండేది. అలాంటి సంత కనుమరుగవుతోంది. చర్ల వారపు సంతకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. - సుధాకర్, చర్ల

వ్యాపారాలు సాగక ఇబ్బందులు



గతంలో వారపు సంతకు పెద్ద ఎత్తున జనం రావడంతో పెద్ద ఎత్తున అమ్మకాలు సాగేవి. కానీ ప్రస్తుతం సంతకు సరిహద్దు రాష్ట్రం నుంచి ఆదివాసీలు రావడం తగ్గడంతో సంత సాగడం లేదు. సంతలో అమ్మకాలు జరుగకపోతుండడంతో వ్యాపారాలు లేక చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. - పి.సత్యనారాయణ, జీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

అశ్వారావుపేటరూరల్: ఇంటర్ విద్యార్థులకు మూడో దశ ప్రాక్టికల్ పరీక్షలను ఆదివారం నుంచి ఈ నెల 14 వరకు జరుగుతాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో కళాశాలకు చెందిన విద్యార్థులతోపాటు ముస్లిం మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో హాజరుకావాలన్నారు.

సింగరేణి సీఎండీకి వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు రూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని, కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) ఆధ్వర్యంలో శనివారం సింగరేణి సీఅండ్‌ఎండి ఎన్.బలరాం నాయక్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్సీడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి.రాసుద్దీన్ మాట్లాడుతూ... సింగరేణి వ్యాప్తంగా వివిధ గనుల్లో, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేట్ డ్రైవర్లు, టీబీ వర్కర్లకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలన్నారు. నాయకులు శ్రీనివాస్, మంగీలాల్, శివరామకృష్ణ, కృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు


వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: వాహనాలకు నంబర్ ప్లేట్లు సరిగా లేకుంటే వాహనదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం భద్రాచలం ఎంవీఐ తిరుపతితో కలిసి బ్రిడ్జి సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టి రోడ్డు భద్రతా వారోత్సవాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొందరు వాహనదారులు వాహనాల నంబర్లు ట్యాంపరింగ్ చేస్తున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతీరోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని విధిగా ట్రాఫిక్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి

మణుగూరు రూరల్: సింగరేణి గిరిజన ఉద్యోగులు ఐకమత్యంతో ముందుకు సాగాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. శనివారం మణుగూరు ఏరియా సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఏరియా జీఎం రామచందర్ జీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. చీఫ్ లైజన్ అధికారి, ఎస్‌టటు జీఎం వీసం కృష్ణయ్య, ఏరియా లైజన్ అధికారి ఇస్లావత్ సతీష్‌కుమార్, డీజీఎం(ఈఅండ్‌ఎం), కే సిహెచ్ ఇన్‌చార్జ్ మదన్‌నాయక్, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏజీఎం(సివిల్) డి వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, రాందాస్, శంకర్, కృష్ణ, లాలు, నరేష్, హరిలాల్, మహేష్, సురేష్, బోరయ్య, బాలాజీ, శ్రీహరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమత జడ్జిమెంట్‌ను అమలుచేయాలి

మణుగూరు టౌన్: సమత జడ్జిమెంట్‌ను అమలు చేసి సింగరేణిలో భూ నిర్వాసితులకు, ప్రభావిత ప్రాంత ఆదివాసీలకు ఉపాధి కల్పించాలని ఆదివాసీ సేన జిల్లా కో-కన్వీనర్ వజ్జ జ్యోతిబస్ అన్నారు. శనివారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం భూ నిర్వాసితులకు, ఆదివాసీ యువకులకు ఉపాధి కల్పించడంలో విఫలమైందన్నారు. మండల కన్వీనర్ సోడె రవి కుమార్ దొర, కార్యదర్శి పూనెం నాగరాజు, గౌరవాధ్యక్షుడు గనిబోయిన ముత్తయ్య, సోడె సమ్మయ్య, కల్యాణ్ ఉన్నారు.

తునికాకు వేలం వెంటనే నిర్వహించాలి




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


దమ్మపేట: తునికాకు యూనిట్ల వేలం పాటలు వెంటనే నిర్వహించాలని కోరుతూ తహసీల్దార్ ముజాహిద్‌కు, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన కార్మిక సంఘం జిల్లా నాయకులు అమర్లపూడి రాము మాట్లాడుతూ... గతంలో పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనసులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. తోడెం దుర్గమ్మ, ముత్యాలరావు, ఆదినారాయణ, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీపీ ముత్తినేని సుజాత శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం అందజేస్తున్న తీరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో జరుగుతున్న తప్పిదాలను పరిశీలించి మరో సారి ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీ కమటం నరేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన భక్తులు


అశ్వారావుపేటరూరల్: యాత్రకు వెళ్తున్న భక్తులు


ములకలపల్లిలో..

ములకలపల్లి : ములకలపల్లికి చెందిన భక్తబృందం శనివారం అయోధ్య క్షేత్ర దర్శనార్థం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని శ్రీభక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య పయనమైన వారిలో ఎంపీపీ మట్ల నాగమణి, వారిలో వీహెచ్‌పి మండల కార్యదర్శి గొడ్ల రాజు, ప్రఖండ ఉపాధ్యక్షుడు పువ్వాల శ్రీనివాస్, పద్దం బుజ్జి, విశ్వ హిందూ పరిషత్ మండలాధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, తిరుపతిరెడ్డి, తాండ్ర ప్రభాకర్‌రావు, రవి అత్యం రాంబాబు, ఓబులశెట్టి ప్రభాకర్, గంటా వెంకటేశ్వర్లు ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: అయోధ్యలోని బాల రాముని దర్శనానికి అశ్వారావుపేట నుంచి భక్తులు తరలి వెళ్లారు. ముందుగా స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో అయోధ్యకు తరలి వెళ్తున్న 40 మంది భక్తుల బృందం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కాకినాడ నుంచి భద్రాచలం..

ఏపీలోని కాకినాడకు చెందిన రామ భక్తులు కాలినడకన భద్రాచలానికి తరలి వెళ్తూ, మార్గమధ్యలోని అశ్వారావుపేటకు శుక్రవారం రాత్రి చేరుకున్నారు. కాగా కాకినాడ నుంచి వచ్చిన భక్తులకు స్థానిక సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక బసను ఏర్పాటు చేసి, భోజనాలను అందించారు.

కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు..


గుండాల: విచారణను పరిశీలిస్తున్న ఆర్డీఓ శిరీషా



పినపాకలో..


అశ్వారావుపేటరూరల్: వివరాలు నమోదు చేస్తున్న ఈఓ, సిబ్బంది

గుండాల: ఎక్కడా తప్పులు దొర్లకుండా దరఖాస్తుల విచారణ చేపట్టాలని, లబ్ధిదారులను పదేపదే కార్యాలయాలు చుట్టూ తిప్పించుకోవద్దని కొత్తగూడెం ఆర్డీఓ ఆర్.శిరీషా అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి దరఖాస్తుల విచారణను శనివారం గుండాల గ్రామంలో సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే.రంగ, మండల పంచాయతీ అధికారి హాజరత్ వలి, ఆర్‌ఐ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఠాకూర్ మనోహర్ సింగ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా దరఖాస్తుల విచారణ

పినపాక: మహాలక్ష్మి పథకం దరఖాస్తుల విచారణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో మహాలక్ష్మి దరఖాస్తుల విచారణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. ప్రతీ పంచాయతీకి అధికారులు వెళ్లి ఇంటింటికి తిరుగుతూ పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఆరు గ్యారంటీ కార్డు పథకాల అమలు కోసం ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులలో సక్రమంగా లేని వాటిని శనివారం ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఈవో హరికృష్ణ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేయగా సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి పూర్తి వివరాలను నమోదు చేశారు.

'గ్రూప్-4'లో సత్తా


ప్రశాంత్


మధు

అన్నపురెడ్డిపల్లి: తాజాగా టీఎస్పీఎస్సీ ప్రకటించిన గ్రూప్ ఫోర్ ఉద్యోగాల ఫలితాల్లో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు సత్తా చాటారు. మండలంలోని అబ్బుగూడేనికి చెందిన జుబ్బురు ప్రశాంత్‌కు 330 ర్యాంక్, జుబ్బురు మధుకు స్టేట్ 246 ర్యాంక్‌తో మెరిట్ లిస్ట్‌లో స్థానం సాధించారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

పినపాక: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని రానున్న రోజుల్లో మనుగడనిస్తాయని తహసీల్దారు వీరభద్ర ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వినితో కలిసి పాత రెడ్డిపాలెం పంచాయతీలో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. హరితహారంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించే బాధ్యత అధికారులతో పాటు ప్రజలు కూడా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మణుగూరు టౌన్: సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొల్లకొత్తూరు గ్రామంలో శనివారం సింగరేణి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు రవికుమార్ 85 మంది గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలందించి బీపీ, షుగర్‌తో పాటు సీజనల్ వ్యాధులకు మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సౌందర్య వతి, శ్రీకాంత్, సేవా సమితి కో-ఆర్డినేటర్ వెంకట మారేశ్వర రావు తదితరులు ఉన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యుడు రవికుమార్

కుష్ఠు వ్యాధిపై అవగాహన

చర్ల రూరల్: స్పర్శ లెప్రసి అవేర్‌నెస్ క్యాంపెయిన్ (స్లాక్)కార్యక్రమంలో భాగంగా శనివారం చర్ల ఐసీడీఎస్ కార్యాలయంలోని అంగన్ వాడీ కార్యకర్తలకు డాక్టర్ శ్రీధర్ కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీ చైతన్య, డీపీఎంఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది వేణు గోపాలకృష్ణ, రాంప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు జి.సౌమ్య, బి.స్వరూప, రాణి, పి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజామునుండే ఆలయంలో వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు కల్యాణం తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామీణ వైద్యులను గుర్తించాలి

బూర్గంపాడు: గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించి, ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. గత ప్రభుత్వం గ్రామీణ వైద్యులపై సవతి తల్లి ప్రేమ చూపిందని, వారికి శిక్షణనిచ్చినప్పటికీ వారికి గుర్తింపునివ్వలేదని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించి చేయూతనందించాలని కోరారు.

కళాశాలలో శ్రమదానం

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మిల్టన్, ప్రోగ్రాం ఆఫీసర్లు శ్యామ్ ప్రసాద్, డాక్టర్ వీరన్న, అధ్యాపకులు డాక్టర్ శ్రీను, సుధాకర్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

అశ్వారావుపేటరూరల్: వచ్చే నెల 3,4, 5వ తేదీల్లో ఖమ్మంలో జరిగే మూడు విప్లవ పార్టీల మహాసభలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక సీపీఐ ఎంఎల్-మాస్‌లైన్ (ప్రజాపంథా) కార్యాలయంలో పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ ఆవిష్కరించారు. కల్లయ్య, వాసం బుచ్చిరాజు, గొంది లక్ష్మణ్‌రావు, కన్నయ్య, రంగారావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలం చిన్నార్లగూడెం గ్రామంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి దాసరి సాయన్న, వీరభద్రం, రాంశెట్టి, కన్నయ్య, పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మణుగూరు రూరల్: మండల పరిధిలోని రామానుజవరం పంచాయతీ కొండాయిగూడెంలో ఇమంది రామాయనమ్మ పక్షవాతంతో బాధపడుతుండగా వైద్యఖర్చుల నిమిత్తం మణుగూరు జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం రూ.10 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు తెలగాని వెంకటేష్, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, గంటా కన్నారావు, గంటా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని పగిడేరు ఎంపీటీసీ కుంజా కృష్ణకుమారి మృతిచెందగా శనివారం పలువురు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే పాయం సతీమణి ప్రమీల, ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావు, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరావు, బచ్చల భారతి, పుచ్చకాయల శంకర్ తదితరులు ఉన్నారు.

కుంగిన చప్టా..

చర్ల రూరల్: మండలంలోని అంజనాపురం నుంచి తిమ్మిరిగూడెం రహదారిలో ఉన్న లోలెవల్ చప్టాపై శనివారం మెటల్‌తో వెళ్తున్న టిప్పర్ దిగబడటంతో చప్టా కుంగింది. తిమ్మిరిగూడెం రోడ్డు నిర్మాణ పనులకోసం వచ్చే వాహనాలకే చప్టా కుంగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాసిరకపు నిర్మాణాల వల్లనే చప్టా కుంగిదని అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


చప్టాపై దిగబడిన టిప్పర్